నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 128Xరంగారెడ్డి | ఆదివారం 06 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 05-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada



# రెండేళ్లు టైమివ్వండి

ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా ఇంకేదైనా సమస్యలుంటే కేకే కమిటీకి తెలియజేయండి

- గురువులే భవిష్యత్ శిల్పులు.. పిల్లల భవిష్యత్‌కు తరగతిగదులే పునాది
- విద్యారంగంలో తెలంగాణ 28 నుంచి 17వ స్థానానికి
- కొడంగల్ గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నిర్భయవార్త ప్రతినిధి : పిల్లల ఎదుగుదలకు, భవిష్యత్‌కు పునాది వేసేది ఉపాధ్యాయులేనని, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే శక్తి గురువులదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం కొడంగల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో విద్యారంగంలో తెలంగాణ 28వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 17వ స్థానానికి చేరిందని సీఎం తెలిపారు. ఈ పురోగతికి ఉపాధ్యాయుల కృషే కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల అడ్మిషన్లు పెరుగుతున్నాయని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం సీట్లు భర్తీ అయ్యాయని వెల్లడించారు.

### 10 వేల టీచర్ పోస్టుల భర్తీ

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో గతంలో తీవ్ర జాప్యం జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు 317 జీవో ద్వారా బదిలీల సమస్యలను పరిష్కరించిందన్నారు. ప్రజాపాలన ప్రారంభమైన 55 రోజుల్లోనే 10 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. కేకే కమిటీతో చర్చించి మరిన్ని సంస్కరణలు చేపడతామని చెప్పారు.

### మరో రెండేళ్లు అవకాశం ఇవ్వండి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనకు మరో రెండేళ్ల సమయం ఇవ్వాలని సీఎం కోరారు. "మరో రెండేళ్లు సమయం ఇవ్వండి.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వచ్చినప్పుడు ప్రభుత్వం చేసిన పనులకు మార్కులు వేయాలని, సమస్యలు పరిష్కరించకపోతే తన పనితీరుపై ప్రజలే తీర్పు ఇవ్వాలని అన్నారు.

### 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు, ట్రాప్‌కు గురికావద్దని సూచించారు. తమ సమస్యలు, సూచనలను కేకే కమిటీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని రేవంత్‌రెడ్డి కోరారు.

# ఫీజుల నియంత్రణ చట్టం ఇంకెప్పుడు?

- అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలి
- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత



నిర్భయవార్త ప్రతినిధి : విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని తెలం గాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించా రు. 2024 మేలో స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని,ఇందుకుసంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి ముందుకు సాగకపోవడంపై నిలదీశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విద్యాశాఖను కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఈ అంశంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లోనూ భారీగా ఫీజులు పెంచినా కట్టడి చర్యలు లేకపోవడం దారుణమని ఆరోపించారు.

### ఐదు శాతానికి మించకూడదు

1994లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 1 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో గవర్నింగ్ బాడీ ఫీజులు నిర్ణయించాలని, ఐదు శాతానికి మించి పెంచేందుకు అవకాశం లేదని కవిత పేర్కొన్నారు. ఈ నిబంధన తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారానికి ప్రభుత్వం అండగా నిలవడం సరికాదన్నారు.

### అసెంబ్లీలో బిల్లు పెట్టాలి

రెండు రోజుల్లో ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఫీజుల నియంత్రణ చట్టానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కవిత డిమాండ్ చేశారు. చట్టం అమల్లోకి వచ్చిన అనంతరం అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం విఫలమైతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు చేపడతామని హెచ్చరించారు.


# కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్: నిర్భయవార్త ప్రతినిధి :యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారు.. ఒక్కటంటే ఒక్కటి అమలు కూడా చేయలేదని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 100 రోజులు అని చెప్పి 1000 రోజులు మోసం చేసిన ధోకేబాజ్ (మోసగాడు)రాజీనామా చేయాల్నా లేదా.. అని అడిగారు. నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్, ఇయ్యాళ్ల పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందన్నారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

# ఉపాధ్యాయుల కంటతడి.. ఏ దేశానికీ మంచిది కాదు

- పీఆర్సీ, డీఏలు ఇవ్వకున్నా విద్యార్థుల భవిష్యత్తు కోసం బోధన
- గురువుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



నిర్భయవార్త ప్రతినిధి : ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం, ఏ రాష్ట్రం బాగుపడదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న గురువులకు శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు చెల్లించకపోయినా ఉపాధ్యాయులు ఓర్పుతో విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. రిటైర్ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం మలిసంధ్యలోనూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నా గురువుల కనీస సమస్యలు పరిష్కారం కాకపోవడం శోచనీయమని విమర్శించారు. టీచర్స్ డే రోజైనా పెండింగ్ బిల్లులు, డీఏలు, ఇతర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే ప్రాథమిక పాఠం నేర్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. అదే గురువులకు ఇచ్చే నిజమైన గౌరవమని స్పష్టం చేశారు.

# సమ్మక్క సాగర్ బ్యారేజీకి వేగంగా ఎన్‌ఓసీ ఇవ్వాలి



హైదరాబాద్ :నిర్భయవార్త ప్రతినిధి : సమ్మక్క--సారక్క బ్యారేజీకి నిర్మాణ అనుమతిని (ఎన్ఓసీ) వీలైనంత త్వరగా జారీ చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరారు. ముంపునకు గురయ్యే భూములు, ఇండ్లకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లిస్తుందని హామీనిచ్చారు. అవసరమైతే పరిహార నిధులను ముందుగానే జమ చేసేందుకు కూడా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పరస్పర సహకారం, సంప్రదిం పుల ద్వారా పెండింగ్ అంశాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్‌కు సంబంధించిన అంతర్రాష్ట్ర అంశాలు, బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపునకు గురయ్యే భూములు, నివాస గృహాలు, బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఛత్తీస్‌గఢ్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్ఓసీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

నిర్భయవార్త

సంపాదకీయం

ఆదివారం 06 సెప్టెంబర్ 2026

## 'ఎల్‌నినో' సన్నద్ధత ఇలాగేనా?

యావత్ ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్న ఎల్‌నినో రానున్న రోజుల్లో ఇప్పటి కంటే మరింత ఉధృతమవుతుందని, వచ్చే ఏడాది కూడా కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తాజాగా చేసిన హెచ్చరిక ఎల్‌నినో ప్రభావాన్ని చవిచూస్తున్న మన రాష్ట్రానికి ప్రమాద ఘంటిక. ఎల్‌నినోతో అనూహ్య, అసాధారణ వర్షాలు, వరదలు, కరువు కాటకాలు, ఉష్ణోగ్రతలు సంభవిస్తాయి. ఎల్‌నినోపై అంచనాలు ప్రారంభమయ్యాక గడచిన దశాబ్దాల్లో కంటే ప్రస్తుత ప్రభావం చాలా ఎక్కువని, ప్రభుత్వాల సన్నద్ధత, స్పందన సైతం అసాధారణంగా ఉండాలని సూచించింది. నిజానికి సీజన్ ప్రారంభానికి ఎంతో ముందుగానే ఎల్‌నినోపై డబ్ల్యుఎంఒ హెచ్చరికలు చేయగా, భౌగోళికంగా తుపాన్లు, వరదలు, కరువులకు ఆస్కారం ఉన్న ఆంధ్రప్రదేశ్ సన్నద్ధత, స్పందన సరిగ్గా లేదని ముందస్తు ఏర్పాట్లను, ప్రణాళికలను చూస్తే అర్థమవుతుంది. వ్యవసాయ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఖరీఫ్ ప్రాణాధారమన్న విషయం ఏలికలకు తెలియనిది కాదు. తాగునీటి సమస్యలు తలెత్తుతాయనీ ఎరుకే. ఎల్‌నినో ప్రభావం సీజన్ మొదట్లో అంతగా ఉండదని సన్నద్ధతపై పెట్టాల్సిన స్థాయిలో శ్రద్ధ వహించలేదు. ఆగస్టు ముగిసి సెప్టెంబర్‌లో పడ్డాక ఇప్పుడు తీరిగ్గా ఎల్‌నినో పరిస్థితులపై వివరిస్తూ, ఆర్థిక సహాయాన్ని అభ్యర్థిస్తూ కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించడం విడ్డూరం. ఇదే ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అతి పెద్ద మేలుగా ప్రచారం చేసుకోవడం అభ్యంతరకరం.నైరుతి రుతుపవనాల చలనంలో బలహీనత, ఎల్‌నినో కట్టకట్టుకొని రాష్ట్రంపై దాడి చేయడంతో ఖరీఫ్ సేద్యం తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. ఏ నెలలోనూ ఏ జిల్లాలోనూ ఇప్పటి వరకు సాధారణ వర్షం పడలేదు. జూన్ నుంచి ఆగస్టు చివరాఖరు వరకు వర్షపు లోటు 54 శాతం. అన్నమయ్య, ప్రకాశం, చిత్తూరు, మార్కాపురం, శ్రీసత్యసాయి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వర్షపు లోటు 60 నుంచి 76 శాతం. అతి త్వరలోనే మరికొన్ని జిల్లాలూ ఈ స్థితికి చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎ.పి.లో 688 మండలాలకుగాను 630 మండలాలు తీవ్ర వర్షాభావంతో కొట్టుమిట్టాడుతున్నాయి. సేద్యం సాధారణ విస్తీర్ణంలో 66 శాతమే జరిగింది. సీజన్ ముగియడానికి ఇంకా పాతిక రోజులే ఉంది. ఈ పూర్వరంగంలో 20-25 లక్షల ఎకరాల్లో సాగు లేక బీడు పడటం ఖాయంగా కనిపిస్తోంది. సాగైన లక్షల ఎకరాల్లో పంటలకు సైతం నీటి గండం పొంచి ఉంది. చాలా చోట్ల పంటలు ఎండుతున్నాయి. భారీగా దిగుబడులు తగ్గనున్నాయి. రాష్ట్రానికి అన్నపూర్ణగా పేరు తెచ్చిన కృష్ణా డెల్టాలో వరి సాగుపై ప్రభుత్వం సృష్టించిన గందరగోళం రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. తాగునీటి అవసరాల కోసమే ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలను వినియోగించాలని ప్రభుత్వం ప్రతిపాదించినా శ్రీశైలంలో తెలంగాణ, ఎ.పి. పోటీపడి విద్యుదుత్పత్తి చేసి దిగువకు నీళ్లొదిలాయి. రాయలసీమకు తాగునీటి అవసరాలకు నీరు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం చుక్కనీరు విడుదల చేయలేదు. వెలిగొండ తొలిదశ ప్రారంభోత్సవానికి కొన్ని నీటిని ఇచ్చారంతే. రాష్ట్రంలో 20 వేల హేబిటేషన్లుండగా 15 వేల హేబిటేషన్లలో తాగునీటి ఇబ్బంది రావొచ్చని కేబినెట్‌లో అంచనా వేశారు. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీలు, నగరాలు, గ్రామాల్లో రెండు మూడు రోజులకోమారు తాగునీరిస్తున్న దశలో భవిష్యత్తు సహజంగానే భయపెడుతుంది. కరువొచ్చినప్పుడు బావులు తవ్వడం మొదలుపెట్టినట్టు కాకుండా ముందుగానే ప్రజలకు రక్షిత తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ కనీస బాధ్యత. కరువొచ్చిందంటే పశువులకు తాగునీరు, మేత, విద్యుత్ సమస్య ముందుకొస్తుంది. తగిన ముందస్తు చర్యలు చేపట్టాలి. కూలీలకు పనులుండవు. ప్రత్యేకంగా ఉపాధిహామీ పనులు చేపట్టి ఆదుకోవాలి. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. బీమా అయోమయం ఉండనే ఉంది. వీలున్న ప్రతి అంగుళం భూమిలోనూ ఏదో ఒక పంట పండించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి. రబీ కోసం సన్నద్ధమవ్వాలి. వీటన్నింటికీ నిధులు కావాలి. హుదూద్ మొదలుకొని బుడమేరు, మొంథా వరకు ఏనాడూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి సాయపడింది లేదు. డబుల్ ఇంజిన్ సర్కారుగా పేర్కొంటున్నందున ఎల్‌నినో సహాయం కోసం కేంద్రంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేసి నిధులు సాధించాలి. జలహారతులు, లేఖలు కంటి తుడుపే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు.

# ప్రశ్నించే తరాన్ని తయారు చేద్దాం...

## విద్యార్థులే నిర్వాసితులు

అక్షర జ్ఞానానికి లోక జ్ఞానాన్ని జోడించి శాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థిలో నింపే సామాజిక శాస్త్రవేత్త ఉపాధ్యాయుడు. చరిత్రను సృష్టించేవారు, సమాజాన్ని నిర్మించేవారు ప్రజలు మాత్రమేనని విద్యార్థులకు చెప్పే చరిత్రకారులు ఉపాధ్యాయులు. తరగతి గదిలో నాలుగు గోడల మధ్య నుంచి జాగృతిని కల్పించే వారు, జ్ఞాన జ్యోతిని వెలిగించే వారు ఉపాధ్యాయులు. సమసమాజ స్థాపనకు తమ వంతు కృషి చేసే ఉపాధ్యాయ దినోత్సవం నేడు. ఈ సందర్భంగా విద్యార్థి-ఉపాధ్యాయుడు-విద్యా వ్యవస్థను రేఖా మాత్రంగా పరిశీలన చేద్దాం.

**నాటి చదువులు...**

ప్రభుత్వ బడులు 90 శాతం, ఎయిడెడ్ స్కూళ్లు 10 శాతంగా ఉండేవి. ఆనాటి స్వాతంత్రోద్యమ స్ఫూర్తితోనే ఆ పాఠశాలలు పనిచేశాయి. ర్యాంకుల గోల లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రకృతితో మమేకం చేస్తూ చదువు చెప్పేవాళ్ళు. విద్యార్థులను క్షేత్రస్థాయి దాకా తీసుకుపోయి నాటి కష్టజీవుల జీవన శైలిని చూపేవారు. విహార యాత్రలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు చదువులో భాగంగా ఉండేవి. గ్రామంలో రాత్రి పాఠశాలలను నడపటం ఉపాధ్యాయుల వృత్తిలో భాగంగా ఉండేది. పర్యవేక్షణకు వచ్చిన అధికారులు సలహాలు, సూచనలతో మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఉపాధ్యాయులకు ఇచ్చేవారు.




**నేటి చదువులు...**

ప్రపంచీకరణ ప్రపంచం మొత్తాన్ని చుట్టేసింది. 'నేను' అనే భావనకి పెద్ద పీట వేసింది. పోటీతత్వాన్ని పెంచింది. వినిమయ సంస్కృతిని ముందుకు తెచ్చింది. వీటన్నిటి కోసం అవసరమైతే కొన్ని దేశాలకు చదువు కోసం అప్పులు ఇవ్వడం ప్రారంభించింది. ఆ చదువుల్లో పోటీతత్వాన్ని పెంచేసింది. సాధించలేకపోతే వేస్ట్ అనే ధోరణిని అలవరచింది. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల సంఖ్య పెరిగిపోయింది. ఇచ్చిన అప్పులతో నడిచే చదువులు ఎలా ఉండాలనే దానికి పైస్థాయి నుంచి కింది వరకు ఒక యంత్రాంగాన్ని సృష్టించింది. దాంతో పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు పెరిగిపోయాయ్. గణాంకాలు, లెక్కలు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ యాప్‌లు, వాటిని నింపి సబ్‌మిట్ చేయడం ప్రధానంగా మారిపోయింది. పిల్లలు ఏం నేర్చుకున్నారనేది చూసేకంటే...తాము అడిగిన సమాచారం వచ్చిందో లేదో తెలుసుకోవడమే ముఖ్యంగా మార్చేశారు. పోటీ పడు, గెలవలేకపోతే వేస్ట్ అనే వరకు వెళ్లారు. 99.9 శాతం మార్కులు తెచ్చుకున్నా ఆ 0.1 శాతం ఎందుకు తగ్గిందని మానసికంగా ఇబ్బంది పెట్టే పరిస్థితులు వచ్చేశాయి. ఇంత ఒత్తిడిలో చదువుకునే చదువు వ్యక్తిగతంగా ఆ చిన్నారులకు ఉపయోగపడుతుందో లేదోగాని సమాజానికి ఎలాంటి ప్రయోజనం లేదు. బడిలో పిల్లల మనస్తత్వం, అక్కడ ఉన్న వాతావరణం, ఆ పిల్లల స్థాయిని బట్టి ఏం నేర్పాలో ఎలా నేర్పాలో, వారిని ఒక స్థాయికి ఎలా తీసుకురావాలో స్థానిక ఉపాధ్యాయుడికి తెలుస్తుంది. కానీ టీచర్ కి పాఠశాలలో స్వేచ్ఛ లేదు. బడిలో వారు ఏం చెప్పాలో కూడా పై నుంచి చెప్తున్నారు. పరీక్ష ఏం పెట్టాలో కూడా పైనుంచి ఇస్తున్నారు. ఈ చదువుతో మంచి బాధ్యత కలిగిన పౌరుణ్ణి తయారు చేయడం సాధ్యమా? అందుకని స్వేచ్ఛాయుతంగా ఉపాధ్యాయుడు చదువు చెప్పే వాతావరణం ఉండాలి. అక్షర జ్ఞానాన్ని మాత్రమే నేర్పటం ఉపాధ్యాయుడి పనిగా ఉండకూడదు. సమాజంలోని అన్ని అంశాల పట్ల సమగ్ర మూర్తిమత్వం కలిగిన విద్యార్థుల్ని తయారు చేసే బాధ్యత కూడా ఉపాధ్యాయులు తీసుకోవాలి.

**ప్రస్తుత పాఠశాలల పరిస్థితి...**

ఏకోపాధ్యాయ పాఠశాలలు 14,000 వున్నాయి. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య అనుకున్నంతగా పెరగలేదు. అనధికారికంగా మూతపడిన పాఠశాలలు అనేకం ఉన్నాయి. గత పాలకులు 3, 4, 5 తరగతులను హైస్కూల్‌కి షిఫ్ట్ చేశారు. ఇప్పుడు వచ్చిన పాలకులు 3, 4, 5 తరగతులను మోడల్ స్కూల్ కి షిఫ్ట్ చేశారు. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లిన పిల్లలు కొద్దిమంది ప్రైవేట్ పాఠశాలకు కూడా మారిన పరిస్థితులున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలంటే ఐదు తరగతి గదులు ఐదుగురు ఉపాధ్యాయులు అనే కాన్సెప్ట్‌తో ప్రారంభించారు. కాని ఐదు తరగతి గదులకు ఐదుగురు ఉపాధ్యాయులను ఇవ్వలేదు. దీనివల్ల మోడల్ పాఠశాల కాన్సెప్ట్ బలహీనపడటంతో పాటు, ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతూనే ఉంది. ఏమైనా ఆ పాఠశాలలను బతికించుకోవాలంటే ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదు తరగతి గదులు ఇచ్చి దానికి ఒక ప్రత్యేక బడ్జెట్ కూడా కేటాయించాలి. 'కర్మయోగి , దీక్ష ప్రశస్త' అనే రకరకాల యాప్ లను అప్‌లోడ్ చేసుకోవటం, వాటిని చదవడం, పరీక్షలు రాయడం పెద్ద పనిగా మారింది. దీనికి సంబంధించి ఉపాధ్యాయుల మీద ఒత్తిడి చేస్తున్నారు. ఉపాధ్యాయులకు అదనపు పనుల భారం తగ్గించి బడిలో పాఠాలను బోధించే స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి. పిల్లలకు అక్షరాలు ఏం వచ్చాయనే దానిమీద కేంద్రీకరణ ఉండాలి.

**చేయాల్సింది...**

సమాజం ఉపాధ్యాయుల మీద పెద్ద బాధ్యత పెట్టింది. ఏ రంగానికి సంబంధించిన వారినైనా తయారు చేసే పని ఉపాధ్యాయులదే. వారు నిజాయితీగా, నిబద్ధతతో, సమాజ అవసరాలకు తగ్గట్టు పని చేయాలన్నా పాఠశాల స్థాయిలోనే పునాది పడాలి. పసితనంలో పడ్డ పునాది కచ్చితంగా తన జీవితాంతం గుర్తుపెట్టుకుని పనిలో కనబరుస్తారు. పిల్లల కష్టంలో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలి. వారి కుటుంబాలతో అనుబంధాన్ని పెంచుకోవాలి. చుట్టూ ఉన్న సమాజానికి బడి పట్ల ఒక నమ్మకాన్ని కలిగించాలి. తల్లిదండ్రులు రోజువారీ పనిలోపడి పిల్లల గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో పిల్లలు బయట సమాజంలోని అవలక్షణాల పట్ల త్వరగా ఆకర్షితులవుతున్నారు. వీరిని మార్చాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులు తీసుకోవాలి. గంజాయి, దొంగతనాలు, తప్పుడు పనులు, దానికి పడే శిక్షలు, కౌన్సిలింగ్ కూడా చదువులో భాగంగా చెప్పాలి. కులం, మతం పేర విభజన అంశాలు సమాజంలో స్వైరవిహారం చేస్తున్నాయి. సమాజంలో, బడిలో సమానత్వ భావనను బోధించాలి. జెన్ జీ, జెన్ ఆల్ఫా లాగా ప్రశ్నించే తరాన్ని తయారుచేయాలి. అదే సమయంలో ఉపాధ్యాయులు తమ పనిలో నైపుణ్యాన్ని, బాధ్యతను పెంచుకోవాలి.

**ఎన్. వెంకటేశ్వర్లు,**

## బడి పిల్లల భద్రత .. !

పిల్లలు పాఠశాలకు ఎందుకు వస్తారు? విద్యా విజ్ఞానాలతో వికసించటానికి. తమ సామర్థ్యాలను పెంపొందించుకొని రేపటి సమాజాన్ని మరింత మెరుగ్గా, మానవీయంగా తీర్చిదిద్దటానికి. అలాంటి విద్యాలయ ప్రాంగణాల నుంచే మరణ వార్తలు వినాల్సిరావడం ఎంత దిగ్భ్రాంతికరం! బడికి వెళ్లిన పిల్లలు కారణం ఏదైనా సరే.. ప్రాణాలు కోల్పోవటం ఏమిటి? ఇటీవల తరచూ విద్యార్థి మరణ వార్త దేశంలో ఎక్కడో ఒకచోట నుంచి వినిపిస్తూనే ఉంది. ఉపాధ్యాయులు మందలించటమో, దండించటమో, అనారోగ్యానికి గురవ్వటమో, సకాలంలో వైద్యం అందకపోవటమో, పాఠశాల ప్రాంగణంలో ప్రమాదం జరగటమో, ఆహార కలుషితమో, పరీక్షల్లో వైఫల్యమో.. కారణం ఏదైనా కావొచ్చు గాక! వికసించాల్సిన పిల్లలు విగతజీవులుగా మారటం తీవ్ర విషాదం. మన వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం.విశాఖపట్నంలో ఆరేళ్ల యుకెజి విద్యార్థి తరగతి గదిలోనే కుప్పకూలి మరణించాడు. ఉపాధ్యాయురాలు దండించటమే కారణమని వార్తలొచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి జిల్లాలో 13 ఏళ్ల ఎనిమిదో తరగతి బాలిక ఉపాధ్యాయుడి దండనకు గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు, మరో విద్యార్థిపై కేసు నమోదైంది. తమిళనాడులోని మదురై జిల్లా ఉసిలంపట్టిలో 16 ఏళ్ల బాలిక పాఠశాలలో అవమానకర పరిస్థితి ఎదురైందని ఆత్మహత్య చేసుకుంది. ఆ స్కూలు ప్రధానోపాధ్యాయురాలిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఫరీదాబాద్‌లో పదకొండో తరగతి విద్యార్థిని పాఠశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దాదాపు నాలుగు గంటలపాటు తరగతి బయట నిలబెట్టడమే దీనికి కారణమని ఆమె కుటుంబం ఆరోపిస్తోంది. ఈ ఘటనలన్నీ పాఠశాల వాతావరణం పిల్లల భద్రతకు, ఆత్మగౌరవానికి ఎంత కీలకమో చెబుతున్నాయి. క్రమశిక్షణ అంటే 'శిక్ష' అనే పాత ఆలోచన మారాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. పిల్లల ప్రవర్తన వెనుక గల కుటుంబ పరిస్థితులు, నేర్చుకునే సామర్థ్యం, భయం, ఒత్తిడి, తోటి పిల్లల ప్రభావం, మానసిక సమస్యలు వంటి అనేక కారణాలను అవగాహనలో పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నాయి.జాతీయ నేర గణాంకాల సంస్థ వివరాల ప్రకారం... దేశంలో 2024లో 14,488 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో కుటుంబ సమస్యల కారణంగా 3,101 మంది, అనారోగ్యం కారణంగా 1,347 మంది, ప్రేమ వ్యవహారాల కారణంగా 1,671 మంది, పరీక్షల్లో వైఫల్యం కారణంగా 1,071 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ గణాంకాల హెచ్చరిక ఏమిటి? ఒక విద్యార్థి సమస్యకు మూలం ఇంట్లో ఉండవచ్చు. కుటుంబ సమస్య పాఠశాలలో ప్రవర్తనా సమస్యగా బయటపడొచ్చు. చదువుపై ఒత్తిడి ఇప్పటికే ఉన్న మానసిక ఆందోళనను మరింత పెంచవచ్చు. అందువల్ల ప్రతి సమస్యకు 'క్రమశిక్షణ'ను పరిష్కారంగా చూడటం ప్రమాదకరం. విద్యార్థిలో అకస్మాత్తుగా కనిపించే ప్రవర్తనా మార్పులను గుర్తించే వ్యవస్థ ప్రతి పాఠశాలలో ఉండాలి. అవసరమైతే శిక్షణ పొందిన కౌన్సిలర్ ద్వారా సహాయం అందించాలి. తల్లిదండ్రులు, సమాజమూ తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. మార్కులు తగ్గటం, పరీక్షల్లో ఫెయిలవ్వటం నేరమూ ఘోరమూ కాదని గ్రహించాలి. వైఫల్యాన్ని స్వీకరించటం నేర్చుకుంటే దాన్ని ఎలా అధిగమించాలో అలవర్చుకోవచ్చు. గెలవటం కన్నా జీవితం అత్యంత గొప్పది, విలువైనది.



పిల్లలకు ఈ విషయాలను నేర్పటం చాలా అవసరం.అలాగే విద్యాసంస్థల్లో భవనాలు, హాస్టళ్లు, ఆహారం, వైద్య సదుపాయాలు విద్యార్థులకు భద్రతను ఇచ్చేవిగా ఉండాలి. రాజస్థాన్‌లోని జైపూర్‌లో పాఠశాల క్యాంటీన్‌లో ప్యాటీ తిన్న తర్వాత 17 ఏళ్ల విద్యార్థి అస్వస్థతకు గురై మరణించాడు. వెంటనే వైద్యం అందకపోవటం ప్రాణాలు పోవటానికి కారణమైందని కుటుంబం ఆరోపణ. ఆంధ్రప్రదేశ్‌లోని సాలూరులో పాఠశాల ప్రహరీ గోడ కూలి పదో తరగతి విద్యార్థి మరణించాడు. మరో విద్యార్థి గాయపడ్డాడు. మహారాష్ట్రలోని జవ్హార్ ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో పాము కాటేయడంతో ముగ్గురు బాలికలు మరణించారు. విద్యార్థినులు నేలపైనే నిద్రిస్తున్నారని, పడకలు లేవని జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. పేద, గిరిజన, దళిత విద్యార్థులు చదువుకునే హాస్టళ్లు, పాఠశాలల్లో భద్రత, రక్షణ కొరవడిన పరిస్థితి పిల్లల ప్రాణాల మీదికి తెస్తోంది. 2016-24 మధ్య మన రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో వివిధ అనారోగ్య కారణాలతో 451 మంది విద్యార్థులు మరణించినట్లు 2025 డిసెంబరు 31న హైకోర్టు ప్రస్తావించింది. ఆరోగ్య తనిఖీ, వైద్యసదుపాయం వారికి నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తరువాత కూడా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు సంభవిస్తూ ఉండడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం.మనం చూస్తున్న ఈ దుష్పరిణామాలకు నయా ఉదార ఆర్థిక విధానాలతోనే బీజం పడింది.

# అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్‌కు అభినందనలు





హైదరాబాద్, సెప్టెంబరు 5: నిర్భయవార్త ప్రతినిధి:సమాచార, పౌర సంబంధాల శాఖలో అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందిన డి.ఎస్. జగన్‌ను శనివారం నిర్భయవార్త ఎడిటర్ అండ్ పబ్లిషర్ బవనారి రవి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎస్. జగన్‌కు పుష్పగుచ్ఛం, శాలువా అందజేసి అభినందనలు తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖలో తన సేవల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంలో ఆయన ఇప్పటికే తనదైన పాత్ర పోషించారని ఈ సందర్భంగా బవనారి రవి కుమార్ పేర్కొన్నారు. అదనపు సంచాలకుడిగా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కూడా జగన్ తన అనుభవం, సమర్థత, పరిపాలనా నైపుణ్యంతో విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమాచార వారధిగా సమాచార, పౌర సంబంధాల శాఖ కీలకమైన బాధ్యతను నిర్వహిస్తుందని, ఆ బాధ్యతల్లో జగన్ మరింత విజయవంతంగా రాణించాలని బవనారి రవి కుమార్ ఆకాంక్షించారు. నూతన పదోన్నతి ఆయన వృత్తిపరమైన ప్రస్థానంలో మరింత ఉన్నతమైన బాధ్యతలకు నాంది కావాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు, ప్రభుత్వానికి మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు



ములుగు సెప్టెంబర్ 5 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడా పోటీలను సెప్టెంబరు 7,8 తేదీల్లో నిర్వహించనునట్లు మండల విద్యాశాఖ అధికారి జి వి వి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జివి వి సత్యనారాయణ మాట్లాడుతూ పోటీలలో 14,17 సంవత్సరాల,వయసు చెందిన బాల బాలికలు పాల్గొనవచ్చు అని అన్నారు. ఈ క్రీడలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులందరూ పాల్గొనవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగ చేసుకోవాలని అన్నారు.బాలురకు క్రీడలు కబడ్డీ ఖో, ఖో,వాలీబాల్ అథ్లెటిక్స్, వంటి క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. బాలురకు క్రీడా వేదిక జెడ్ పి హెచ్ ఎస్ వెంకటాపురం గాను, బాలికలకు క్రీడా వేదిక ఆశ్రమ పాఠశాల చిరుతపల్లి -1 గాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్,తీసుకొని రావాలని తెలపడం జరిగింది. వివరాలకు సంప్రదించవలసిన వారు బి ప్రవీణ్ పిడి, జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం ఫోన్ నెంబరు : 830 9648722.అని పత్రిక ముఖంగా తెలిపారు.

# విద్యార్థులలో విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందిస్తూ చక్కగా ఎదిగేలా చూడాలి.... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

## 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం. గురుపూజోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.




ఖమ్మం, సెప్టెంబర్ 5 నిర్భయవార్త రిపోర్టర్. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.శనివారం స్థానిక శ్రీ భక్త రామదాసు కళా క్షేత్రంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. “ఉపాధ్యాయులు పిల్లల జీవితాలను శాశ్వతంగా మార్చగలరని, మనం ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా మన గురువుల పట్ల ఉండే గౌరవం ఎప్పటికీ అలాగే ఉంటుంది” అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది మొదటి తరం విద్యార్థులేనని, అలాంటి పిల్లలకు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పాత్రను కూడా పోషించాలని సూచించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు మంచి నడవడిక, విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.వివేకం లేని విద్య శూన్యం. మార్కుల కంటే సంస్కారం ముఖ్యమని, పెద్దలను గౌరవించడం, సత్యం కోసం నిలబడటం, నైతిక విలువలను పాటించడం వంటి విలువలను విద్యార్థులకు బోధించాలి” అని కలెక్టర్ పేర్కొన్నారు.తన విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల పాత్రను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తనకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోధించిన టీచర్ తనకు ఎలాంటి ఫీజు తీసుకోకుండా విద్యాబోధన చేయడంతో పాటు, ఆ సమయంలో వారు అందించిన ప్రోత్సాహం, మద్దతు తనను ఈ స్థాయికి తీసుకువచ్చేందుకు దోహదపడిందని భావోద్వేగంతో తెలిపారు.సమాజంలో ప్రస్తుతం అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, గతంలో ఉపాధ్యాయులు ఏదైనా మందలించినా అది తమ మంచికేనని విద్యార్థులు, తల్లిదండ్రులు భావించేవారని కలెక్టర్ అన్నారు. ఇంట్లో కూడా ఉపాధ్యాయులను దేవుని రూపంగా గౌరవించేవారని గుర్తు చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. “ఇల్లు మొదటి పాఠశాల అని, ఇల్లు, పాఠశాలలోని వాతావరణమే పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది” అని తెలిపారు.తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ఉపాధ్యాయుని పట్ల తనకున్న గౌరవం కారణంగా తనకు అంతగా ఇష్టం లేని సోషల్ సబ్జెక్టు తర్వాత తనకు ఇష్టమైన సబ్జెక్టుగా మారిందన్నారు.

పిల్లలను మంచి మార్గంలో తీర్చిదిద్దే ప్రయత్నంలో ఎప్పుడూ ఆశను వదులుకోకూడదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశావాహ దృక్పథంతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తముడేనని, అయితే ఈ రోజు ఉత్తమ ఉపాధ్యాయు లుగా గుర్తింపు పొందిన వారికి లభించిన గౌరవం ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. కోవిడ్ అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా మారి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగినప్పటికీ, 90 కి పైగా ప్రైవేట్ పాఠశాలలు ముందుకు వచ్చి బెస్ట్ అవైలబుల్ స్కూల్ విధానంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు సహకరించాయని తెలిపారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఇంచార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. ఎఫ్ఆర్ఎస్ అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని, పదవ తరగతి ఫలితాలు కూడా మెరుగ్గా వచ్చాయని తెలిపారు. విద్యా ప్రమాణాల్లో జిల్లా మంచి పనితీరు కనబరుస్తోందని, ఈ ఏడాది ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ జిల్లాలోని 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు

## హరీశ్ రావు, కేటీఆర్ సభలో అడుగుపెడితే మంత్రులకు ముచ్చెమటలు
## వృద్ధులు,మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి





సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాలో హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం ఎమ్మెల్యేచింత ప్రభాకర్ సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన ధర్నాఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.ఇప్పుడు ఆ హామీల అమలులోమాటలు కోటలు దాటుతున్నాయి. చేతలు గడప దాటడం లేదు”ఎల్ అన్న చందంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన ధర్నా నిర్వహించింది. కేసీఆర్ వస్తే రేవంత్‌కు తట్టుకోలేరు.అసెంబ్లీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగుపెడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ చింత ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే ముఖ్యమంత్రి, మంత్రులునోట్లో నాలుక లేనట్టుగా సమాధానం కోసం తడబడుతున్నారనిఎల్ ఎద్దేవా చేశారు.చెప్పేది శ్రీరంగనీతులు చేసేది తలకిందుల పనులు అన్నట్టుగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. వృద్ధులకు రూ.4,000 పింఛన్ హామీ ఏమైంది ఎన్నికల సమయంలో వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వృద్ధులను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. మాట ఇచ్చి మడమ తిప్పడం ప్రజలకు ఆమోదయోగ్యం కాదుఅని పేర్కొంటూ వృద్ధులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారుమహిళలకు రూ.2,500 ఎక్కడ మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. మహిళలకు నెలనెలా రూ.2,500 అందిస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆడబిడ్డల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఆడబిడ్డలకే ఇచ్చిన మాటను మరిచిపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరుఅని హెచ్చరించారు. వికలాంగులకు రూ.6,000 పింఛన్ హామీ ఏమైంది వికలాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేయకుండా వికలాంగులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాటఎద్దు పోయిన తర్వాత గోతులు తవ్వినట్టుగా అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెట్టడం సరికాదుఅని విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులు కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేశారని, ఇప్పుడు అదే ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు వృద్ధులకు రూ.4,000 పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వికలాంగులకు రూ.6,000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీఎస్జీవోరాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు స్ఫూర్తిదాయకం బండి రమేష్

**భారత్‌నగర్ ప్రభుత్వ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం**



కూకట్‌పల్లి సెప్టెంబర్ 05 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భారత్‌నగర్‌లోని ప్రభుత్వ పబ్లిక్ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి బండి రమేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యారంగ అభివృద్ధికి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను బలోపేతం చేయడంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలను ఆయన స్మరించుకున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజానికి మంచి పౌరులను అందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, టెంపుల్ చైర్మన్ మూర్తి, వెంకటేష్ యాదవ్, బాలరాజు, క్రాంతి, రమణ, సంతోష్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు రత్నారావు, లక్ష్మీ, రాజారావు పలువురు పాల్గొన్నారు.



## నోటీసుల అనంతరం ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలి

ఎన్ఐఆర్--2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ మను చౌదరి



కీసర, సెప్టెంబర్ 5 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 (ఎస్ఐఆర్--2026)లో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిధిలోని అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించి ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో మ్యాపింగ్ జరగని ఓటర్లు, ఓటరు కార్డుల్లో వివరాల వ్యత్యాసాలు (అనామలీస్) ఉన్న కేటగిరీలకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన, ధ్రువీకరణ పూర్తయిన అనంతరం సంబంధిత పత్రాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఓటరు జాబితాలోని ఓటర్లు తమ వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ) ద్వారా అవగాహన కల్పించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఫారం--6, చిరునామా మార్పు తదితర సవరణలకు ఫారం--7, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల వివరాలకు సంబంధించి ఫారం--8 అందించి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకటరెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్‌రెడ్డి, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట ఆయిల్ ఫామ్ D.O. ఆఫీస్ వద్ద ధర్నా: ఆయిల్ ఫెడ్ ఆస్తులను కాపాడాలని రైతుల డిమాండ్



అశ్వారావుపేట సెప్టెంబర్ 5 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) తెలంగాణ ఆయిల్ ఫెడ్ విలువైన భూములను, ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం అశ్వారావుపేట ఆయిల్ ఫామ్ నర్సరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఇ.ా.) కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. “తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ (గ్రోవర్స్ సొసైటీ” ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు తుంబురు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యలు మాట్లాడుతూ... హైదరాబాద్ అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్లాట్ నెం.1 లోని 15,984.50 చదరపు గజాల భూమిని 1991లో ద్వారా) ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారని తెలిపారు. గతంలో లహోటి ఆయిల్ మిల్స్ లీజ్ నిబంధనలు ఉల్లంఘించడంతో ప్రభుత్వం లీజును రద్దు చేసిందని, అనంతరం సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన తీర్పుల ప్రకారం కూడా ఆ భూమిపై లహోటి మిల్స్ హక్కులు పరిమితమేనని స్పష్టమైందని వివరించారు. గతంలో జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులు ఆధారంగా TSOILFED అధీనంలో ఉన్న విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను తక్షణమే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ సంస్థ ఎంతోమంది రైతులకు అండగా నిలుస్తూ, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేస్తోందని, సంస్థ భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ ఆస్తులను కాపాడాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ఐ.ఏ.ఎస్ గారికి పంపించేందుకు స్థానిక అధికారులకు అందజేశారు. ఈ ప్రతిని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండీ షేక్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లకు కూడా పంపినట్లు తెలిపారు. ?ఈ ధర్నా కార్యక్రమంలో ఆయిల్ పామ్ రైతులు కె. రవికుమార్, టి. నాగిరెడ్డి, ఎం. శ్రీనివాసరావు, సిహెచ్. వీరస్వామి, పి. రంగారావు, పి. రాంబాబు, ఎం. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులు

**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలి: కలెక్టర్ మను చౌదరి**

**జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**



మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 5 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ (టీచర్స్ డే) శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రతి ఒక్కరూ తమ విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందిగా భావిస్తారని తెలిపారు. విద్యార్థుల కోణంలో ఆలోచిస్తూ, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, నిరంతర అభ్యాసం, విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించేలా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే.. ఆ జ్ఞానాన్ని జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో నేర్పించేది ఉపాధ్యాయులేనని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆచరణాత్మక విలువలను విద్యార్థులకు అందించి, సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేలా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థుల్లోని లోపాలను గుర్తించి సరిదిద్దడంతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి సులభమైన పద్ధతుల్లో బోధించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థి విజయం సాధించినప్పుడు సంతోషించే గురువు.. అదే విద్యార్థి వైఫల్యం చెందినప్పుడు ధైర్యం నింపి, మరోసారి ప్రయత్నించేలా ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి రోజు విద్యార్థులతో కనీసం 5 నుంచి 10 నిమిషాల పాటు దినపత్రికలు చదివించేలా చూడాలని సూచించారు. దీనివల్ల విద్యార్థుల్లో సామాజిక అవగాహన, విలువలు పెంపొందడంతో పాటు భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత కూడా విద్యార్థితో పాటు కొనసాగేదే నిజమైన విద్య అని కలెక్టర్ అన్నారు. పాఠశాలలో నేర్చుకున్న విషయాలను విద్యార్థి తన వ్యక్తిగత జీవితంలో, సమాజంలో ఆచరణలో పెట్టగలిగితేనే ఉపాధ్యాయుడి బాధ్యత సంపూర్ణంగా నెరవేరినట్లు అవుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులందరికీ మరోసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

**ఆధునిక విద్యకు అనుగుణంగా బోధన**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతికతను, నూతన బోధనా విధానాలను ఆకళింపు చేసుకుని పాఠ్య ప్రణాళికలను రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. విద్యార్థులకు ఆధునిక, నాణ్యమైన విద్యను అందిస్తూ జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేశానికి అవసరమైన భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.



**ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**

అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలు అందజేశారు. పుష్ప మొక్కలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెంకటాపురం మండలంలో హోరెత్తిన గులాబీ జోరు

**మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్**





ములుగు సెప్టెంబర్ 5 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంది. మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం గులాబీ జోరు హోరెత్తింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గర నుండి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. కార్యకర్తలు గులాబీ జెండాలు చేతబట్టి “జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్” అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గంప రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అనంతరం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షులు గంప రాంబాబు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటు నుండి నేటి వరకు గిరిజన, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి పాటుపడింది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కేసీఆర్ హయాంలోనే పోడు భూములకు పట్టాలు, దళిత బంధు, గిరిజన బంధు, రైతు బంధు వంటి పథకాలు వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెంకటాపురం మండలంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, యూత్ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు సీపీ డా. ఎం. రమేష్ సన్మానం**
**విద్యార్థులతో ముఖాముఖి.. ట్రాఫిక్, మహిళల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన**







గచ్చిబౌలి సెప్టెంబర్ 05 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రవేష్, ఐపీఎస్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సీపీ.. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరి జీవితంలో తల్లే తొలి గురువు" అని అన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు."విద్యార్థులు ఉన్నతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు మనం అందించే గొప్ప బహుమతి" అని సీపీ అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో పాటు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడంలో పోలీసులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్యార్థులతో సీపీ ముఖాముఖి**
అనంతరం సీపీ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సమాజంలో ఎదురవుతున్న వివిధ సమస్యలు, వాటి పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

**ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి జూడ్ ప్రశ్న**
విద్యార్థి జూడ్ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సీపీని కోరాడు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడంతో పాటు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించేలా అవగాహన కల్పించాలని కోరాడు.దీనిపై సీపీ స్పందిస్తూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చని తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు.

**మహిళలు, బాలికల భద్రతపై అవగాహన**
విద్యార్థిని స్నేహిత మహిళలు, బాలికల భద్రత కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించింది. దీనికి సీపీ సమాధానమిస్తూ మహిళలు, బాలికల రక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే 100 లేదా 112కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

**డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి** పాఠశాలకు వచ్చే మార్గంలో కొందరు వ్యక్తులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు కనిపిస్తున్నారని కొంతమంది విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీపీ.. డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.విద్యార్థులు ఇలాంటి కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తాము డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులను కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని కోరారు. రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని ట్రాఫిక్ పోలీసుల సహాయం తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి** విద్యార్థి నిఖిల్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని కోరగా, ఓటీపీ చెప్పిన వెంటనే తన ఖాతా నుంచి రూ.4,000 డెబిట్ అయ్యాయని సీపీ దృష్టికి తీసుకువచ్చాడు. ఇలాంటి మోసాల నుంచి ఎలా రక్షించుకోవాలని ప్రశ్నించాడు.సీపీ స్పందిస్తూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంక్ వివరాలు, పిన్ లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన హెచ్ఎం రెహానా బేగం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్లను సీపీ డా. ఎం. రమేష్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ భూపతి, పోలీసు అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామ నాయకత్వ శిక్షణకు సింగరేణి సర్పంచ్ వీరప్రతాప్

**ఖమ్మం జిల్లా నుంచి ఎంపికైన పది మంది సర్పంచ్‌లలో చోటు**
**విలువలు,నాయకత్వ సామర్థ్యం, మానసిక శ్రేయస్సుపై ప్రత్యేక శిక్షణ**



సింగరేణి సెప్టెంబర్ 05 నిర్భయవార్త రిపోర్టర్. సర్పంచ్‌లను విలువలతో కూడిన సమర్థవంతమైన గ్రామ నాయకులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న విలువల ఆధారిత సామర్థ్య పెంపు,శ్రేయస్సు కార్యక్రమానికి సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ ఎంపికయ్యారు.ఖమ్మం జిల్లా నుంచి ఈ ప్రత్యేక శిక్షణకు పది మంది సర్పంచ్‌లను ఎంపిక చేయగా,వారిలో సింగరేణి మండలం నుంచి వీరప్రతాప్‌కు అవకాశం దక్కింది.పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ విద్యా సంస్థ సహకారంతో సర్పంచ్‌ల కోసం ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.హైదరాబాద్‌లోని గచ్చిబౌలి శాంతి సరోవర్‌లో సెప్టెంబర్ 6న ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ మేరకు ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి జి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామ పాలనలో సర్పంచ్‌ల పాత్రను మరింత సమర్థవంతం చేయడంతో పాటు వారిలో నైతిక విలువలు,నాయకత్వ లక్షణాలు,పరిపాలనా సామర్థ్యం,ప్రజలతో సమన్వయం,నిర్ణయ సామర్థ్యం,వ్యక్తిగత శ్రేయస్సు,మానసిక ప్రశాంతత పెంపొందించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం.ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ పారదర్శకంగా పాలన సాగించడం,గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించనున్నారు.జిల్లాలోని వివిధ మండలాల నుంచి పది మంది సర్పంచ్‌లను ఈ కార్యక్రమానికి ఎంపిక చేయగా,సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ ఎంపిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.శిక్షణలో పొందే అవగాహన,నాయకత్వ మెళకువలు గ్రామాభివృద్ధికి మరింత దోహదపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# దేవరయాంజాల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ఉపాధ్యాయులకు సన్మానం.. విద్యార్థులకు నగదు పురస్కారాలు**



దేవరయాంజాల్ సెప్టెంబర్ 05 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరయాంజాల్‌లోని మండల పరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు బాలేశ్, కళ్యాణి ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు బేజగం ఆనంద్‌రావు, సింగం రామారావు, సముద్రాల లక్ష్మయ్య, పుర ప్రముఖులు ప్రహ్లాద్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జైపాల్‌రెడ్డి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి డైరీ, పెన్, స్వీట్ బాక్స్‌లు అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ నాలిక లక్ష్మీనారాయణ కూడా ఉపాధ్యాయులను సన్మానించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బేజగం ఆనంద్‌రావు, చింతల శ్రీనివాస్‌రెడ్డి, బర్రెంకబావి రవీందర్‌రెడ్డి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు. అలాగే 1 నుంచి 9వ తరగతి వరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సింగం డాక్టర్ రామారావు, సముద్రాల లక్ష్మయ్య నగదు ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి, తమకు మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఎప్పటికీ మరువకూడదని ఈ సందర్భంగా పలువురు సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కట్ట మీనా కుమారి, పేండం లక్ష్మీనారాయణ, పట్నం నర్సింహారెడ్డి, మిర్యాలకర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**గొండ్వానా సంక్షేమ పరిషత్, ఆదివాసీ సర్పంచుల డిమాండ్**



ములుగు సెప్టెంబర్ 5 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ఇటీవల కర్రెగుట్టల సమీపంలో ప్రెజర్ బాంబు పేలి మృతి చెందిన నూగూరు కాలనీకి చెందిన ఆదివాసీ యువకుడు మడకం నాగేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ), ఆదివాసీ సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గొండ్వానా సంక్షేమ పరిషత్, ఆదివాసీ సర్పంచుల ఆధ్వర్యంలో వెంకటాపురం మండల తహసీల్దార్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అడవిలో జీవనోపాధి కోసం కంక బొంగుల సేకరణకు వెళ్లిన మడకం నాగేశ్వరరావు ప్రెజర్ బాంబు పేలడంతో మృతి చెందారని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ సోంది వీరయ్య మాట్లాడుతూ ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగూరు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు కర్రెగుట్టల సమీపంలో జరిగిన విషాదకర ప్రెజర్ బాంబు పేలుడు ఘటనలో మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందన్నారు. కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.ఆదివాసుల జీవన విధానం పూర్తిగా అడవితో ముడిపడి ఉంటుందని, జీవనోపాధి కోసం అడవిపై ఆధారపడే ఆదివాసీలు ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పూర్తయిందని చెబుతున్నప్పటికీ అడవుల్లో మిగిలి ఉన్న ప్రెజర్ బాంబులను తొలగించకపోవడం వల్ల ఆదివాసీ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు.అడవుల్లో మిగిలి ఉన్న ప్రెజర్ బాంబులను వెంటనే గుర్తించి తొలగించాలని, ఆదివాసీల ప్రాణాలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మడకం నాగేశ్వరరావు కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం దృష్టిలోకి తీసుకుని తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, వెంకటాపురం మేజర్ సర్పంచ్ తాటి సరస్వతి, బెస్తగూడెం సర్పంచ్ భీమేశ్వరి, పాత్రపురం సర్పంచ్ బొగ్గుల పుష్పవతి, తిప్పాపురం సర్పంచ్ చందా శిరీష, మాజీ సర్పంచ్ జజ్జరి నారాయణమ్మ, సూరవీడు సర్పంచ్ ఇర్ప మురళి, పూనెం సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి జీవితానికి దిశా నిర్దేశం చేసి విజయ శిఖరాలకు నడిపించే మార్గదర్శి ఉపాధ్యాయుడు




**ఉపాధ్యాయుడు చెప్పే ఒక మంచి మాట విద్యార్థి జీవితాన్నే మారుస్తుంది**
**విద్యార్థులకు గురువే జ్ఞానానికి వెలుగు,గురువే భవిష్యత్తుకు బాట ఐటీడీఏ పీవో బి రాహుల్**



భద్రాచలం సెప్టెంబర్ 5 నిర్భయ వార్త ప్రతినిధి. ఒక మంచి ఉపాధ్యాయుడు పాఠాలను మాత్రమే బోధించడని, ఒక మంచి ఉపాధ్యాయుడు జీవితాన్ని బోధిస్తాడని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఉపాధ్యాయులు మన భవిష్యత్తుకు రూపం ఇస్తారని, గిరిజన విద్యార్థినీ విద్యార్థులను మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే గురుతర బాధ్యత మీపై ఉందని, మీరిచ్చే సలహాలు, సూచనలు, మీ యొక్క ప్రత్యేక శ్రద్ధ గిరిజన విద్యాలయాల బలోపేతానికి ఉపకరిస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం నాడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలో పిఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి,సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యకు సంబంధించిన అంశాలను కవిత రూపంలో తెలియజేశారు. విద్యార్థుల ఊహలకు ఊపిరిలుదుతూ ఉన్నత స్థానాలను చేరేలా వారిని ఉత్సాహపరిచే ఉపాధ్యాయులందరికీ విద్యార్థులకు గుణ గుణాలు గుర్తిస్తూ గుణాత్మకమైన విద్య వైపు గురిపెడుతూ గమ్యాన్ని చేరేలా గతి శక్తినిచ్చే గురువులందరికీ విద్యార్థుల సాధక బాధలు తెలుసుకుంటూనే సమాజం పట్ల బాధ్యతగా బ్రతికేలా తీర్చిదిద్దే బోధకులు అందరికీ అధ్యాయాలను అభ్యంతరాలను అర్థవంతంగా పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు అయ్యేలా ఉపకరించే అధ్యాపకులు అందరికీ ఆచరణాత్మక అంశాలను అచ్చులు పడేలా అందిస్తూ అండగా ఉండే ఆచార్యులు అందరికీ సగటు మనిషి జీవిత సారాన్ని తమ విషయ పరిజ్ఞానంతో సానబెట్టి సారవంతంగా సముచితంగా చేసే సార్లు అందరికీ విద్యార్థుల మేధా సంపత్తిని పదును పెడుతూ అంతర్లీన ప్రతిభను మేలుకొలుపుతూ తిరిగి లేని శక్తుల ప్రతి ఒక్కరిని తయారు చేసే మేడం లందరికీ తమపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని తప్పునట్లు వారి తనయులను తిరిగి లేని శక్తిగా టీచర్లు అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరింత ప్రత్యేకమైన వని, మారుమూల ప్రాంతాల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విద్యార్థుల కోసం తమ సమయాన్ని శ్రమను వెచ్చిస్తూ వారు చేస్తున్న సేవ నిజంగా అభినందనీయమని, ఒక గిరిజన విద్యార్థి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు ఆ విజయానికి వెనుక తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పాటు ఒక ఉపాధ్యాయుడు కృషి మార్గదర్శకం తప్పకుండా ఉంటుందని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని తీర్చిదిద్దితే ఒక కుటుంబం మారుతుందని, 100 మంది విద్యార్థులను తీర్చిదిద్దితే ఒక సమాజం మారుతుందని, వేలాది విద్యార్థులను తీర్చిదిద్దితే ఒక దేశ భవిష్యత్తు మారుతుందని అందుకే ఉపాధ్యాయ వృత్తి ఒక ఉద్యోగం మాత్రమే కాదని అది ఒక బాధ్యత, ఒక సేవ, ఒక పవిత్రమైన యజ్ఞమని అన్నారు. గిరిజన విద్య బలోపేతం కావడానికి మీ అందరి సహకారంతోటే ఏ ప్రోగ్రాం చేసిన అది మీ ద్వారానే పోవాలి అది తప్పనిసరిగా పిల్లలకు అందే విధంగా ఉద్దీపకం-1, 02, ప్రవేశపెట్టడం జరిగిందని దాని ద్వారా మంచి రిజల్ట్ వచ్చాయని,ప్రాథమిక విద్యలో పునాది గట్టిగా పడితేనే అది హై స్కూల్ లెవెల్లో గాని పై చదువులో కూడా తీసుకెళ్లేది ప్రైమరీ ఎడ్యుకేషన్ కాబట్టి అది మనం బాగు చేసుకుంటే మనకు మంచి రిజల్ట్ వస్తాయని ఉద్దేశంతో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిస్తే మన పిల్లలకు కూడా మంచిగా ఉంటుందని అన్నారు. హై స్కూల్ లెవెల్ లో చదివే విద్యార్థులకు విద్య అనేది బలోపేతం అవుతుందని అది దృష్టిలో పెట్టుకొని ఇటువంటి కార్యక్రమాలు చేయడం జరిగిందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో నమ్మకముతో బడులకు పంపిస్తారని, అక్కడున్న టీచర్స్, సిబ్బంది వారిని తమ సొంత పిల్లల వలె కంటికి రెప్పలా కాపాడుతూ చూసుకోవాలని అన్నారు. సమాజంలో మనం అందరితో అనగా ఇంజనీర్స్, డాక్టర్స్ అవసరం పడ్డప్పుడే మనము వారితో కనెక్ట్ అవుతారని,పుట్టిన ప్రతి ఒక్క బాబు గాని, పాప గాని మెజార్టీ భాగము వాళ్ళ యవ్వనం వాళ్ళ పరిస్థితి ఏదైనా ఉందంటే అది విద్యాశాఖ మాత్రమే అని, పిల్లలు ఏమీ తెలియని పసిపిల్లలను తల్లిదండ్రులు ఎక్కడి నుంచో తీసుకువచ్చి మన పాఠశాలల్లో చేర్పిస్తారని వారికి విద్యాబుద్ధులు నేర్పించి ఎవరెస్టు శిఖరం ఎక్కించే స్థాయికి వాళ్ళకు జ్ఞానాన్ని అందించి వాళ్ళు ఉన్నతమైన స్థానాలకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులందరికీ మరి ఒకసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యాభివృద్ధి కొరకు మనం చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇచ్చాయని, ఆ ఫలితాలతోటే విద్యా వ్యవస్థను ప్రైమరీ నుండి పటిష్టం చేయడానికి ఉద్దీపకం 3,వారధి పుస్తకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, విద్యార్థులు ప్రతిరోజూ వారి చదివే సబ్జెక్టులతో పాటు వారానికి మూడు రోజులు ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులలో కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి అంశాలను వారికి అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని అన్నారు. అలాగే పదవ తరగతిలో ఫలితాలు చాలా సంతృప్తి ఇచ్చాయని, చదువుతోపాటు క్రీడలలో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించి ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించి ఐటీడీఏ కు మంచి పేరు తీసుకువచ్చారని, అలాగే వేరే పాఠశాలలను పోల్చుకొని పరిశీలిస్తే మన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభ్యాసం చాలా బాగుందని అన్నారు. ప్రతి పాఠశాలలో కుల మతాలు, రాగద్వేషాలు, ధనికా పేద అని తారతమ్యం లేకుండా ఆశ్రమ, గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు ఉన్నతమైన విద్య కెరీర్ పై పిల్లలను మనం అందరం కలిసి ఉత్తేజపరిచి బాగా చదువుకొని ప్రయోజకులు అయ్యేలాగా చేయాలని అన్నారు. గతంలో విద్యార్థులకు వివిధ క్విజ్ పోటీలలో పాల్గొనేలా చేసి వారిలో దాగివున్న నైపుణ్యాలను ప్రదర్శించిన పాఠశాలలకు మొదటి, రెండు బహుమతులు నగదు రూపంలో అందించి పాఠశాల అభివృద్ధికి చేయూత అందించామని, తెలుగు భాషా దినోత్సవం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని, దాంతోపాటు సెల్ఫీ కాంపిటీషన్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. పాఠశాలల్లో ఏ సమస్య ఉన్న మా పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరిస్తున్నామని త్వరలో టీచర్ల సర్దుబాటు కూడా చేస్తామని అన్నారు. కాబట్టి ఉపాధ్యాయులు ఇష్టంతో కష్టపడుతూ తన విద్యార్థుల లోని ప్రతిభను గుర్తించి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి విద్యుత్ తో పాటు విలువలు క్రమశిక్షణ మానవత్వం దేశభక్తి వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని ఆయన అన్నారు. ఆశ్రమ పాఠశాలలు, పదవ తరగతి నూటికి నూరు శాతం పరీక్షా ఫలితాలు సాధించిన ఆయా పాఠశాలల హెడ్మాస్టర్ లను, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ టీచర్లుగా ఎంపికైన వారికి పురస్కారాలు అందజేశారు. అదేవిధంగా టీచర్స్ డే సందర్భంగా ఉద్దీపకం-3, వారధి రూపకల్పనలో సహాయ సహకారాలు అర్పీలకు, క్రీడలలో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన పిడి పీఈటీలకు ప్రత్యేకంగా శాలువాలతో సత్కరించి పురస్కారాలు అందించారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ , డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని, ఆర్ సి ఓ గురుకులం ఏసీఎంవోలు ,ఏటిడిఓ లకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏసీఎంవో రమేష్, రాములు, ఏటీడీవోలు రాధమ్మ, చంద్రమోహన్, భారతీదేవి, పి ఐ టి సి ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, జి సి డి వో అలివేలు మంగతాయారు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ సిబ్బంది, పీఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్




భద్రాచలం సెప్టెంబర్ 05 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచల ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తిలో ఘనంగా గురుపూజోత్సవం నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజుని పురస్కరించుకొని భద్రాచల స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమమును జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య జాన్ మిల్టన్ హాజరయ్యారు. ప్రధానాచార్యుల ప్రసంగిస్తూ గురువులను గౌరవించాలని, వారు చూపే మార్గంలో నడవాలని, తెలుపుతూ శ్రీరాముని, ఏకలవ్యని, కర్ణుని, గురు భక్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, శ్రీమతి హవిల, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాస్, ఎన్ ఎస్ ఎస్ కన్వీనర్స్ డాక్టర్ కిరణ్ డాక్టర్ సుధాకర్, రాజనీతి విభాగ అధ్యాపకులు వీరస్వామి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కపిల భారతి మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రకాంత్ కు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ పురస్కారం




సికింద్రాబాద్ సెప్టెంబర్ 5 నిర్భయవార్త ప్రతినిధి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా, శనివారం రోజు అబిడ్స్ లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సభలో, బన్సీలాల్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న యం.చంద్రకాంత్, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య చేతుల మీదుగా అందుకున్నారు.

## భద్రాద్రిలో బహుముఖ ప్రజ్ఞశాలులకు ఘన సన్మానం...

## భద్రాచలం ఎంఈఓ శ్రీనివాసరావు





భద్రాచలం సెప్టెంబర్ 5 నిర్భయ వార్త ప్రతినిధి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో 8 మంది బహుముఖ ప్రజ్ఞాశాలులైన ఉత్తమ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించినట్లుగా మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాస్ రావు తెలిపారు. వృత్తిపరంగా ప్రవృత్తి పరంగా, ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి పలువురు బలహీన బడుగు వర్గాల పిల్లలకు ఆశాజ్యోతి గా నిలిచిన ఉపాధ్యాయులను అన్ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయంతో మండల స్థాయిలో ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో, శాలువాలు కప్పి, పూల గుచ్చాలు అందించి, మెమెంటోలు ఇచ్చి, మెడల్ ప్రధానం చేసి ఘన సన్మానాన్ని ఘనంగా నిర్వహించారు.

**ఘన సన్మానాన్ని పొందిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...**

బీవీ రత్నకుమారి, జాూ బైలాజికల్ సైన్స్, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల భద్రాచలం, కే పుష్ప, జాూ ఫిజికల్ సైన్స్, జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల, భద్రాచలం, పి నాగమణి, జాూ సోషల్ స్టడీస్, గవర్నమెంట్ హై స్కూల్ భద్రాచలం, బి జయబాబు, జాూ బయోలాజికల్ సైన్స్, గవర్నమెంట్ హై స్కూల్ భద్రాచలం, ఎస్ ఎన్ వి అరుణ కుమారి, ా+ు, ఎంపీపీ ఎస్ లంబాడి కాలనీ, ఎస్ శ్రీదేవి, ా+ు, ఎంపీపీ ఎస్ రెవిన్యూ కాలనీ, జి తిరుమల కుమారి, ా+ు, ఎంపీపీ ఎస్ తాతగుడి సెంటర్. ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అవార్డు తీసుకున్న ప్రతి ఉపాధ్యాయుడు మరింత కష్టపడి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఫోగ్రామ్ కన్వీనర్ గా పనిచేసిన రాజ శ్రీనివాస్ ప్రసంగిస్తూ మండలంలో కష్టపడి అంకిత భావంతో అన్ని రకాలుగా స్వచ్ఛందంగా పనిచేసిన ఉపాధ్యాయులకు నేడు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం రావడం తమకెంతో ఆనందంగా ఉందని వారి సేవలు భవిష్యత్తులో మరింతగా మెరుగుపరుచుకోవాలని వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఆయన జాన్సన్ మాట్లాడుతూ మండల స్థాయిలో గుణాత్మక విద్యను పెంపొందించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను గుర్తించి చక్కటి సన్మానం నిర్వహించినందుకు మండల విద్యాశాఖ అధికారి కి అభినందనలు తెలియజేస్తూ ఉపాధ్యాయులు అందరూ అంకితభావంతో పనిచేయడం ద్వారా మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉంచాలని కోరినారు.

ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్, పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి టి రామకృష్ణ, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జయ బాబు, సన్మాన గ్రహీతలు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎం ఆర్ సి సిబ్బంది, మండలంలోని ఉన్నత మండల పరిషత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలన.. హామీలు ఎక్కడ?

## మహిళలకు రూ.2,500 భృతి.. తులం బంగారం.. ఉచిత స్కూటీలు ఏమయ్యాయి?
## మహిళలకు ఇచ్చిన హామీలు గాలికి..
## పింఛన్ల పెంపు ఏమైంది అభివృద్ధి శూన్యం.. ప్రకటనలే ఎక్కువ..
## మహిళా సదస్సులో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజం..

నిర్భయవార్త ప్రతినిధి : మెదక్ ప్రతినిధి రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన పూర్తిగా ×మోసపూరితంగా సాగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి మహిళలతో కలిసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, బంజారా మహిళలతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ, కోలాటం ఆడుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన తులం బంగారం, ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రతి నెలా మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. 33 నెలల కాలానికి ఒక్కో మహిళకు సుమారు రూ.82,500 బకాయి పడినట్లేనని పేర్కొన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.33 నెలల కాలానికి వృద్ధులు, బీడీ కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ.66 వేల చొప్పున, దివ్యాంగులకు కూడా రూ.66 వేల చొప్పున బకాయి ఉందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించిన రైతుబంధు కంటే ఎక్కువగా రైతులకు ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో పాఠశాలల్లో మౌలిక వసతులు క్షీణించాయని, విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయి వేలాది పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1003 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు.ఎన్నికల సమయంలో మహిళల కోసం ప్రకటించిన మహిళా డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా విస్మరించారని విమర్శించారు.అలాగే పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను మరిచిపోయారని అన్నారు. రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టారని, ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను ఆగం చేశారని ఆరోపించారు.ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరించిందని తిరుపతిరెడ్డి విమర్శించారు. మహిళలు, రైతులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.మహిళలు, రైతులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని వారు అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజల పక్షాన నిలబడి హామీల అమలు కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు అరేళ్ళ.మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి. జగపతి, అకిరెడ్డి.కృష్ణ రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాత్ రావు,మున్సిపల్ కౌన్సిలర్ లు అనీస్ ఫాతిమా, జుబెర్ అహ్మద్, దీపక్ కుమార్,ఉదయ్ కుమార్, సోహెల్,మాజీ కౌన్సిలర్ లు అంకం.చంద్రకళ, మాయ. మల్లేశం,ఆర్కే. మల్లేశం, శంకరంపేట్ మాజీ జడ్పీటీసీ మాధవి రాజు, రామాయంపేట మాజీ ఎంపీపీ పుట్టి. విజయలక్ష్మి, కౌన్సిలర్ చౌదరి. చరిత,మెదక్, హవెలిఘనపూర్, శంకరంపేట్, పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టయ్య, మహిళా నాయకురాలు ప్రభావతి, సుజాత, రాధా, లత, ,సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు,నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం



నిర్భయవార్త ప్రతినిధి :..బీఆర్ఎస్ అధినేత, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట్ ప్రకాష్‌నగర్‌లో నాలుగో రోజు ధర్నా నిర్వహించారు. బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ టి. మహేశ్వరి శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేశ్వరి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని మహేశ్వరి స్పష్టం చేశారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

# పునఃప్రారంభమైన ఆర్టీసీ బస్సు సర్వీస్




నిర్భయవార్త ప్రతినిధి :టేక్మాల్. గత కొన్ని రోజుల నుండి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసు తిరిగి ప్రారంభశీఆర్టీసీ బస్సు సర్వీసును డిపో అధికారులు ఎట్టకేలకు పునఃప్రారంభించారు. టేక్మాల్ మార్గంలో నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసు శనివారం నుంచి తిరిగి అందుబాటులోకి వచ్చింది. ఈ మార్గంలో కొన్ని రోజుల నుచ్చి ధనురా వరకు మాత్రమే రావడం జరుగుతుంది. మండల కేంద్రమైన టేక్మాల్ వరకు బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. స్థానిక , ప్రజాప్రతినిధుల ధనురా వద్ద బస్సు ను అపి నీరసన తెల్పిన బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్దయ్య. మాజీ ఎంపీపీ స్వప్న రవి.స్థానిక యువకులు మహిళలు రోడ్డు పై అపి ధర్నా చేశారు ప్రజల ఇబంది మేరకు స్పందించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు తిరిగి ఈ రూట్‌లో సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఇ బస్సు లింగంపల్లి టేక్మాల్ రూట్ లో నడుస్తుంది ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్తులు: బస్సు సర్వీసు తిరిగి ప్రారంభం కావడం పట్ల స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులకు, కృషి చేసిన స్థానిక నేతలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు విద్యాలయాలకు వెళ్లడానికి సౌకర్యంగా నిలిచిందని సంతోషం వ్యక్తం చేయడం జరిగింది

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న సదాశివపేట ఉపాధ్యాయులు

సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంభారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సదాశివపేట మండలం నుండి ఆరుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోన్నారు. అవార్డు గ్రహీతలు:-కృష్ణయ్య – ప్రధానోపాధ్యాయులు పెద్దాపూర్ ఉన్నత పాఠశాల,అస్మా సుల్తానా -ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్.ఎ ఫిజికల్ సైన్స్ ఉర్దూ సదాశివపేట్,శ్రీనివాస్ – ఫిజికల్ డైరెక్టర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సదాశివపేట్,బి. జర్నయ్య – సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు,నిజాంపూర్ ప్రాథమిక పాఠశాల,జి. నవనీత – సెకండరీ గ్రేడ్ టీచర్, నిజాంపూర్ కాలనీ,ఎం.డి అర్షద్ – ప్రాథమిక పాఠశాల ఉర్దూ వెల్టూర్ వీరు ఈ పురస్కారాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి,జిల్లా విద్యాధికారి రోహిణి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ సదాశివపేట మండలానికి ఆరు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు రావడం సంతోషకరమైన విషయం అన్నారు

# నాలెడ్జ్ ఐకాన్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




కుత్బుల్లాపూర్ నిర్భయవార్త ప్రతినిధి : .ఉపాధ్యాయుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ సూరారంలోని నాలెడ్జ్ ఐకాన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, మహోన్నత విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఎంతో ఆనందోత్సాహాలతో పాటు భావోద్వేగంగా సాగాయి.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులే ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించడం నిలిచింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లోకి వెళ్లి, వివిధ అంశాలను ఎంతో ఆత్మవిశ్వాసంతో, చక్కగా వివరించారు. వారు పాఠాలను చాలా చక్కగా, అర్థమయ్యే విధంగా బోధించడంతో ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి పాఠాలు బోధించడం ద్వారా గురువుగా ఉండటం వెనుక ఉన్న బాధ్యత, సహనం, కృషిని విద్యార్థులు అనుభవించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల పట్ల మరింత గౌరవాన్ని కలిగించింది.ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గల ప్రేమ, గౌరవం మరియు కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మేడమ్ మరియు పాఠశాల కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ గారు ఆశీర్వాదాలను తీసుకున్నారు. తమకు అండగా నిలిచి, ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రోత్సహించినందుకు ప్రిన్సిపాల్ మేడమ్ మరియు కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ గారుకు విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం.వై. రాజేష్ కుమార్ మాట్లాడుతూ, “ఉపాధ్యాయుడు కేవలం పాఠాలను బోధించే వ్యక్తి కాదు... ఒక విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి. ఒక మంచి ఉపాధ్యాయుడు అందించే జ్ఞానం, విలువలు మరియు ప్రోత్సాహం విద్యార్థి జీవితాన్ని జీవితాంతం ప్రభావితం చేస్తాయి. ఈరోజు మీరు ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ఉపాధ్యాయుల స్థానంలో నిలబడి వారి బాధ్యతను అర్థం చేసుకోవడం మీకు ఒక గొప్ప అనుభవం. భవిష్యత్తులో మీరు ఏ రంగంలో ఉన్నా, మీకు జ్ఞానాన్ని అందించిన గురువులను ఎప్పటికీ గౌరవించాలి” అని అన్నారు.“ప్రతి విద్యార్థిలో ఒక మంచి భవిష్యత్తు దాగి ఉంది. ఆ భవిష్యత్తును వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులది. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, మానవతా విలువలను నేర్చుకున్నప్పుడే విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధిస్తాడు” అని ఆయన పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడి, ఆనందం మరియు గురువుల పట్ల వారి ప్రేమాభిమానాలతో నిండిపోయింది. గురువు--శిష్యుల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అందరి హృదయాలను హత్తుకున్నాయి.


**హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్**

**టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్**

**నేషనల్ ఒలింపియాడ్ ప్రోగ్రామ్ 2026–2027**

**ఖగోళ శాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం మరియు జూనియర్ సైన్స్** విభాగాలలో

ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే విద్యార్థులందరూ, **‘ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్’ (IAPT)** నిర్వహించే సంబంధిత **‘నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్స్’ (NSEs)**కు తప్పనిసరిగా హాజరు కావాలి. **ఈ పరీక్షలు 2026 నవంబర్ 21 మరియు 22 తేదీలలో జరుగుతాయి.**

NSEలో అర్హత సాధించడం అనేది **2027లో జరిగే సంబంధిత అంతర్జాతీయ ఒలింపియాడ్లలో** పాల్గొనడానికి మొదటి అడుగు.


నమోదు (Enrollment) కోసం:

**NSEs** : https://www.iapt.org.in (ఆగస్టు 21 నుండి సెప్టెంబర్ 14 2026 వరకు)

మరిన్ని వివరాల కోసం: https://olympiads.hbcse.tifr.res.in మరియు https://www.iapt.org.in

CBC 48143/11/0006/2627




సీఎస్ఐఆర్ - జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ

ప్రకటన సంఖ్య 01/2026 – పూర్తి ప్రకటన కోసం QRని స్కాన్ చేయండి

భారత ప్రభుత్వపు సైన్స్ & టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన CSIR ఆధ్వర్యంలోని ప్రముఖ పరిశోధన మరియు అభివృద్ధి (R&D) సంస్థ 'CSIR-NGRI' (హైదరాబాద్, తెలంగాణ), 'టెక్నీషియన్ (1) గ్రేడ్-II (1)'కు సంబంధించిన 21 (ఇరవై ఒకటి) పోస్టుల భర్తీకి భారతీయ పౌరుల నుండి కేవలం CSIR-NGRI వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రిజర్వేషన్: 21 పోస్టులు - (UR-15, EWS-02, SC-03, ST-01) మరియు UR 15 పోస్టులలో; PwBD-OH కోసం 01 పోస్టు, PwBD-HH కోసం 01 పోస్టు & మాజీ సైనికుల కోసం 02 పోస్టులు రిజర్వ్ చేయబడ్డాయి. టెక్నీషియన్ పోస్టు ట్రేడ్‌లు: ఫిట్టర్; ప్లంబర్; ఎలక్ట్రీషియన్; కంప్యూటర్/ఐటి అసిస్టెంట్ (కంప్యూటర్ ఆపరేటర్ & ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ లేదా కంప్యూటర్ హార్డ్‌వేర్ & నెట్‌వర్క్ మెయింటెనెన్స్); డిజిటల్ ఫోటోగ్రాఫర్; కెమికల్ ప్లాంట్ ల్యాబొరేటరీ అసిస్టెంట్; మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్; ఫిజియోథెరపీ టెక్నీషియన్; క్యాటరింగ్ & హాస్పిటాలిటీ అసిస్టెంట్.

ప్రారంభం: 05.09.2026(శనివారం) 10:00 AM

చివర: 04.10.2026(ఆదివారం) 06:00 PM

*#వివరణాత్మక ప్రకటన www.ngri.res.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది.

సం/-
ఉన్నత పరిపాలనా నియంత్రణాధికారి

CBC 36225/11/0002/2627



# కయాదు ప్రమోషన్ల వివాదం.. అసలు కారణం ఇదేనా?

దీంతో కయాదు లోహార్ పై సినిమాలను ఎంపిక చేసుకుని ప్రమోట్ చేస్తున్నారా? అనే ప్రశ్నలు కూడా వచ్చాయి.సినిమా విడుదలకు ముందు ప్రమోషన్లు ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కొత్తగా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్న హీరోయిన్లు తమ సినిమాలను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రమోషన్స్ ఈవెంట్స్ లో చురుగ్గా పాల్గొనాల్సి ఉంటుంది. అయితే హీరోయిన్ కయాదు లోహార్ విషయంలో మాత్రం ప్రమోషన్ల అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తెలుగులో కయాదు లోహార్ కు తొలి చిత్రంగా వచ్చిన అల్లూరి ప్రమోషన్లకు ఆమె పెద్దగా హాజరు కాలేదనే టాక్ అప్పట్లో వినిపించింది.  తాజాగా ఆమె తొలి తమిళ మూవీ ఇమ్మోర్టల్ విషయంలోనూ ఇదే పరిస్థితి ఎదురైందనే ప్రచారం మొదలైంది. అయితే అదే సమయంలో దుల్కర్ సల్మాన్ నటించిన ఐ యామ్ గేమ్ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ లో కయాదు కనిపించడంతో ఆ వ్యవహారం మరింత హాట్ టాపిక్ గా మారింది. ఒకే సమయంలో తన సినిమాల



విషయంలో భిన్నంగా వ్యవహరించడం ఎందుకంటూ సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ముఖ్యంగా తన తొలి తమిళ సినిమాకు ఇంపార్టెన్స్ ఇవ్వకుండా మరో సినిమాను ప్రమోట్ చేస్తున్నారంటూ కొందరు నెటిజన్లు విమర్శలు చేశారు. దీంతో కయాదు లోహార్ పై సినిమాలను ఎంపిక చేసుకుని ప్రమోట్ చేస్తున్నారా? అనే ప్రశ్నలు కూడా వచ్చాయి. అయితే ఆ ప్రచారానికి కయాదు తాజాగా వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. తాను ఏ సినిమాను తక్కువగా చూడలేదని, ప్రమోషన్లకు హాజరు కాకపోవడానికి ప్రధాన కారణం డేట్స్ సమస్యేనని ఆమె స్పష్టం చేశారు. ప్రమోషన్ల కోసం తనకు ఒక రోజు మాత్రమే ఖాళీగా ఉండగా, అదే రోజున ఐ యామ్ గేమ్ టీమ్ కార్యక్రమాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. దీంతో ఆ మూవీ ప్రమోషన్స్ లో పాల్గొనాల్సి వచ్చిందని వివరించారు.ాశ్రీంశీ =ఘుస – బేబీ నీడలో పడకుండా తప్పించుకున్న తెలివైన డెబ్యూటెంట్! మరోవైపు ఇమ్మోర్టల్ టీమ్ అదే రోజున ఎలాంటి ఈవెంట్స్ ప్లాన్ చేయలేదని ఆమె చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత తాను మరో భారీ సినిమా షూటింగ్ లో బిజీ కావడంతో తమిళ మూవీ ప్రమోషన్లకు సమయం కేటాయించలేకపోయానని కయాదు లోహార్ పేర్కొన్నారు. షూటింగ్ షెడ్యూల్స్ ఒక్కసారి ప్రారంభమైతే వాటి మధ్యలో సమయం కేటాయించడం అంత ఈజీ కాదని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఐ యామ్ గేమ్ కు సంబంధించిన తర్వాత ప్రమోషన్ కార్యక్రమాల్లోనూ తాను అన్ని చోట్లా పాల్గొనలేకపోయానని కయాదు వెల్లడించారు. అంటే ఒక సినిమాకు మాత్రమే ఇంపార్టెన్స్ ఇచ్చి, మరో సినిమాను కావాలనే పక్కన పెట్టినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నది ఆమె క్లారిటీ. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై కూడా కయాదు స్పందించినట్లు తెలుస్తోంది. అభిమానులు, నెటిజన్లు తమకు కనిపించిన విషయాల ఆధారంగా అంచనాలు వేస్తారని, కానీ ఒక నటికి ఉన్న షూటింగ్ కమిట్మెంట్స్, డేట్స్ సమస్యలు బయటివారికి పూర్తిగా తెలియకపోవచ్చని ఆమె అభిప్రాయపడుతున్నారు. కయాదు లోహార్ క్లారిటీతో వివాదానికి కొంత క్లారిటీ వచ్చినప్పటికీ, డెబ్యూ సినిమాల ప్రమోషన్ల విషయంలో నటీనటులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే చర్చ మాత్రం కొనసాగుతోంది. ముఖ్యంగా ఒకే సమయంలో పలు సినిమాలు చేతిలో ఉన్నప్పుడు ప్రమోషన్ డేట్స్ ను ముందుగానే ప్లాన్ చేసుకుంటే ఇలాంటి అపోహలకు అవకాశం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 'ఫేమ్' కంటే 'టాలెంట్'కే జై కొడుతున్నారా?

సాధారణంగా ఒక కొత్త దర్శకుడు తన కథతో నిర్మాత దగ్గరకు వెళ్లినప్పుడు.. ముందుగా ఎక్స్పీరియన్స్ గురించి ప్రశ్నలు వస్తాయి. ఇంతకుముందు ఏ సినిమా చేశాడు?సినిమా తీయాలంటే కథ కావాలి.. ఆ స్టోరీని తెరకెక్కించే టాలెంట్ ఉండాలి. కానీ ఇవన్నీ ఉన్నా ఒక కొత్త దర్శకుడికి మూవీ ఛాన్స్ రావడం అంత ఈజీ కాదు. ఎందుకంటే ఆయనకు మార్కెట్ ఉండదు. గత సినిమాల రికార్డు ఉండదు. నిర్మాతకు పూర్తి నమ్మకం ఉండదు. అయితే ఇప్పుడు టాలీవుడ్ లో ఆ లెక్క కాస్త మారుతున్నట్టు కనిపిస్తోంది. ఫేమ్ కంటే టాలెంట్ ను నమ్మి కొత్త దర్శకులకు ఛాన్స్ ఇవ్వడం ఆసక్తికరంగా మారుతోంది.



సాధారణంగా ఒక కొత్త దర్శకుడు తన కథతో నిర్మాత దగ్గరకు వెళ్లినప్పుడు.. ముందుగా ఎక్స్పీరియన్స్ గురించి ప్రశ్నలు వస్తాయి. ఇంతకుముందు ఏ సినిమా చేశాడు? ప్రేక్షకులకు ఎలా నచ్చుతుంది? పెట్టుబడి తిరిగి వస్తుందా? అనే సందేహాలు ఉంటాయి. కథ బాగున్నా.. దర్శకుడి పేరు తెలియకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు వెళ్లడం కష్టమవుతుంది. ఇలాంటి సమయంలో ఇప్పటికే ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్న ఫిల్మ్ మేకర్లు కొత్తవాళ్లపై నమ్మకం పెట్టుకోవడం వారికి పెద్ద అవకాశంగా మారుతోంది. ఒక కొత్త దర్శకుడి కథను నమ్మి నిర్మాణ పరంగా అండగా నిలిస్తే.. ఆ ప్రాజెక్టుకు మొదటి నుంచే ఒక గుర్తింపు వస్తుంది. అంతేకాదు.. కొత్త దర్శకుడికి తన ఆలోచనను పూర్తి స్థాయిలో స్క్రీన్ పై చూపించే అవకాశం లభిస్తుంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. కొత్త దర్శకుడి పేరు పెద్దది కాకపోయినా, కథలో ఉన్న కొత్తదనం ముఖ్యంగా మారుతోంది. ఇంతకాలం హీరో, హీరోయిన్, దర్శకుడి మార్కెట్ ఆధారంగా సినిమాలపై అంచనాలు ఏర్పడేవి. ఇప్పుడు కొన్ని ప్రాజెక్టుల్లో మాత్రం కథ ఏంటి? కొత్త దర్శకుడి ఆలోచన ఏంటి? అనే ప్రశ్నలకు ప్రాధాన్యం పెరుగుతోంది. కొత్త దర్శకులకు అవకాశం ఇవ్వడం వెనుక మరో కారణం కూడా ఉంది. ఇప్పటికే విజయాలు అందుకున్న దర్శకులకు ఇండస్ట్రీలో ఒక రేంజ్ ఏర్పడుతుంది. నిర్మాతలు, నటీనటులు, టెక్నీషియన్లతో సంబంధాలు పెరుగుతాయి. అలాంటి సమయంలో తమకు వచ్చిన అవకాశాన్ని మరొకరికి అందించడం సాధ్యమవుతుంది. దీంతో ఒకరి కెరీర్ మరో వ్యక్తికి మార్గం చూపించే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ఫుల్ ఫేమ్ ఉన్న వ్యక్తి అండగా నిలిచినంత మాత్రాన సినిమా విజయం సాధిస్తుందనే గ్యారంటీ లేదు.

# బేబీ నీడలో పడకుండా తప్పించుకున్న తెలివైన డెబ్యూటెంట్!

అయితే ఆదిత్యకు ఇక్కడ '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' రూపంలో ముందే ఒక దారి ఉంది. 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' పూర్తిగా కొత్త కథ కాదు.'బేబీ'తో వంద కోట్ల సినిమా ఇచ్చిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి వస్తున్నారంటే పోలికలు అక్కడి నుంచే మొదలవుతాయి. ఆ సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లు, ప్రేమ, గొడవలు, చివర్లో వచ్చే పెయిన్ ప్రేక్షకుల్లో అంతగా గుర్తుండిపోయాయి. అలాంటి జోడీని తన తొలి సినిమాలో తీసుకున్న ఆదిత్య హాసన్‌కు మొదటి నుంచి ఒక చిన్న సమస్య ఉంది. మళ్లీ అదే ఫీల్ ఇస్తే 'బేబీ'తో పోలిక తప్పదు. మరీ దూరంగా వెళితే ఈ పెయిర్ వల్ల వచ్చిన ప్లస్ పూర్తిగా వాడుకున్నట్టు ఉండదు. అయితే ఆదిత్యకు ఇక్కడ '90స్ ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' రూపంలో ముందే ఒక దారి ఉంది. 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' పూర్తిగా కొత్త కథ కాదు. '90స్'లో చిన్న పిల్లాడిగా కనిపించిన ఆదిత్య పెద్దవాడైన తర్వాత జరిగే కథ. ఆ క్యారెక్టర్‌ను ఆనంద్ దేవరకొండ చేస్తున్నాడు. శివాజీ, వాసుకి కూడా తల్లిదండ్రులుగా కొనసాగుతున్నారు. అంటే 'బేబీ' జోడీని తీసుకున్నా, ఆదిత్య కథ మాత్రం తన సొంత ప్రపంచం నుంచే మొదలైంది. ఆనంద్ క్యారెక్టర్ విషయంలో కూడా ఇదే తేడా కనిపిస్తోంది. 'బేబీ'లో ప్రేమలో పూర్తిగా చిక్కుకుపోయిన యువకుడిగా కనిపించాడు. ఇక్కడ మధ్యతరగతి కుటుంబం నుంచి లండన్ వెళ్లిన స్టూడెంట్. కొత్త దేశం, కాలేజ్, ప్రేమ చుట్టూ కథ నడుస్తోంది. ట్రైలర్‌లో కూడా హెవీ డ్రామా కంటే కామెడీ, రొమాన్స్‌కు ఎక్కువ స్పేస్ కనిపించింది. వైష్ణవి చైతన్యకు కూడా 'బేబీ' తర్వాత ఇదే మొదటి పెద్ద మార్పు. అక్కడ ఆమె క్యారెక్టర్ చుట్టూనే కథలో ఎక్కువ సంఘర్షణ నడిచింది. 'ఎపిక్'లో మాత్రం పూర్తిగా మరో టోన్‌లో కనిపిస్తోంది.



ఇద్దరూ మళ్లీ జంటగా ఉన్నా, వాళ్ల మధ్య కెమిస్ట్రీని అదే సినిమాకు కొనసాగింపులా చూపించకుండా ఆదిత్య ముందే జాగ్రత్తపడ్డట్టు ప్రమోషనల్ కంటెంట్‌లో తెలుస్తోంది. పైగా ఆదిత్యకు ఇది దర్శకుడిగా తొలి ఫీచర్ ఫిల్మ్. '90స్'తో వెబ్ సిరీస్‌లో పేరు తెచ్చుకున్నాడు. మధ్యలో సాయి మార్తాండ్ తెరకెక్కించిన 'లిటిల్ హార్ట్స్'కు నిర్మాతగా ఉండి థియేటర్ రిజల్ట్ కూడా చూశాడు. ఇప్పుడు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో తన కథను పెద్ద తెరకు తీసుకొస్తున్నాడు. మొదటి సినిమాకే వంద కోట్ల జోడీ దొరకడం ప్లస్ అయినా, అదే జోడీ గత సినిమా నీడ కూడా వెంట వస్తుంది. అందుకే 'ఎపిక్' దగ్గర ఆదిత్య చేసిన మంచి పని ఒకటుంది. ఆనంద్, వైష్ణవిని తీసుకుని మరో 'బేబీ' చేయడానికి ట్రై చేయలేదు. ఇప్పుడు సెప్టెంబర్ 11న సినిమా చూసిన ప్రేక్షకుడికి ఆనంద్, వైష్ణవి కనిపించినా 'బేబీ' కంటే 'ఎపిక్' క్యారెక్టర్లే గుర్తుండిపోతే, ఆదిత్య మొదటి పెద్ద పని అక్కడే పూర్తయినట్టే.

# 'ఇరుముడి' సెన్సేషన్.. డే 15 కూడా భారీ బుకింగ్స్!




మాస్ మహారాజ రవితేజ హీరోగా ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన అవైటెడ్ సినిమానే ఇరుముడి. మంచి అంచనాలు నడుమ వచ్చిన ఈ సినిమా సంచలన హిట్ అయ్యింది. ఇక సినిమా రెండు వీకెండ్స్ ని విజయవంతంగా పూర్తి చేసుకొని మూడో వారాంతం లోకి ఎంటర్ అయ్యింది.ఇంట్రెస్టింగ్ గా ఈ మూడో వారాంతంలో కూడా భారీ బుకింగ్స్ తో దుమ్ము లేపింది. బుక్ మై షోలో ఈ సినిమా 15వ రోజు 1 లక్ష టికెట్స్ కి పైగా సేల్ చేసుకోవడం విశేషం. దీనితో ఇన్ని రోజులు అయినా ఇరుముడి మేనియా గట్టిగా కొనసాగడం విశేషం. ఇక ఇది కేవలం శుక్రవారం బ్యాటింగ్ మాత్రమే అసలు వీకెండ్ రోజులు శనివారం, ఆదివారం అంతకు మించే పెర్ఫార్మన్స్ ఉంటుంది. సో ఈ రెండు రోజుల్లో ఇరుముడి ఎలా రాణిస్తుందో చూడాల్సిందే.

# మరిది సినిమాకి 'ఎపిక్' ప్రీమియర్స్ కన్ఫర్మ్ చేసిన రష్మిక!

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆనంద్ దేవరకొండ హీరోగా టాలెంటెడ్ యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా దర్శకుడు ఆదిత్య హాసన్ తెరకెక్కించిన రోమ్ కామ్ చిత్రమే 'ఎపిక్'. తన ఓటీటీ హిట్ 90స్ బయోపిక్ కి కొనసాగింపుగా ప్లాన్ చేసిన ఈ సినిమా ఎట్టకేలకు ఈ సెప్టెంబర్ లో విడుదల కాబోతోంది.అయితే ఈ సినిమా రిలీజ్ దగ్గరకి వస్తున్న నేపథ్యంలో మేకర్స్ నిన్న ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఇక ఈ ఈవెంట్ కి ఆనంద్ సోదరుడు విజయ్ దేవరకొండ భార్య, స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా తన మరిది సినిమా కోసం ముఖ్య అతిథిగా విచ్చేసింది. అయితే తన ఎనర్జిటిక్ స్పీచ్ తో ఫుల్ జోష్ నింపిన రష్మిక ఈ సినిమా ప్రీమియర్స్ తో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నట్టు కన్ఫర్మ్ చేసేసింది.దీనితో ఈ స్టేట్మెంట్ వైరల్ గా మారింది. సో మేకర్స్ ఈ సినిమా విషయంలో గట్టి నమ్మకం గానే ఉన్నారని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి హీషం అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా నిర్మాణం వహించారు. అలాగే ఈ సెప్టెంబర్ 11న సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది.



# తెలంగాణ యాసతో కట్టిపడేస్తున్న రష్మిక.. హైదరాబాద్ కోడలు మేజిక్!

నాకు చాలా జెలస్‌గా ఉంది కానీ ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తా. విజయ్ గారితోటి షూటింగ్ చేసి వచ్చినా.. ఏందయ్యా సామీ! తెలుగు ప్రాంతాలైన ఆంధ్రా, తెలంగాణల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విభిన్నమైన యాస, భాషా సౌందర్యం ఉంది. ఇక్కడి సంస్కృతి, జీవన విధానం మారినట్లే మాట్లాడే తీరులోని వైవిధ్యం కూడా ఎంతో గమ్మత్తుగా, ఆకర్షణీయంగా అనిపిస్తుంది. ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండల తెలంగాణ యాస చాలా ప్రత్యేకంగా, వినసొంపుగా ఉంటుంది. ఇప్పుడు ఇదే తెలంగాణ యాసను టాలీవుడ్ నేషనల్ క్రష్ రష్మిక మందన్న కూడా ఎంతో ముచ్చటగా ఒంటబట్టించుకుని అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. బాలీవుడ్‌కి మైండ్ బ్లాంక్! రష్మిక మందన్న స్వస్థలం కర్ణాటకలోని కూర్గ్ (కొడగు) జిల్లాలోని విరాజ్‌పేట. అక్కడి కొడవ కమ్యూనిటీకి చెందిన రష్మిక బెంగళూరులో చదువుకుని, కన్నడ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తన నటనతో, క్యూట్‌నెస్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.



అయితే విజయ్ దేవరకొండను వివాహం చేసుకుని 'హైదరాబాద్ కోడలు'గా మారిన తర్వాత, రష్మిక మాట తీరులో తెలంగాణ యాసలోని లాలిత్యం భాసించడం విశేషం. ఇటీవల ఆనంద్ దేవరకొండ నటించిన ఎపిక్ (జ్యూ×జ) సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక ముచ్చటైన తెలంగాణ యాస అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేదికపై యాంకర్ –లవ్ విషయంలో విజయ్ గారి గురించి ఒక మాట చెప్పాలంటే ఏం చెబుతారు?– అని ప్రశ్నించినప్పుడు రష్మిక ఇచ్చిన సమాధానం.. దానికి జవాబుగా మాట్లాడిన యాస సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఆ ప్రశ్నకు రష్మిక ఎంతో క్యూట్‌గా స్పందిస్తూ.. –విజయ్ గారి గురించి ఏం చెప్పాలి.. ఇప్పుడు జిమ్‌లో ఉన్నారు. నాకు చాలా జెలస్‌గా ఉంది కానీ ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తా. విజయ్ గారితోటి షూటింగ్ చేసి వచ్చినా.. ఏందయ్యా సామీ! సో, షూటింగ్ జరుగుతుంది– అంటూ పక్కా తెలంగాణ యాసలో జవాబిచ్చి అక్కడున్న వారందరినీ అలరించారు. విజయ్ దేవరకొండ శైలిలో ఆమె పలికిన ఏందయ్యా సామీ అనే పదం ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ్ గారితోటి షూటింగ్ చేసి వచ్చినా.. అంటూ తెలంగాణ యాసతో ఆకట్టుకున్నారు. మొత్తానికి హైదరాబాదీ కోడలికి యాస–భాష బాగా వంట పట్టాయని నెటిజనులు ప్రశంసిస్తున్నారు. మైత్రీ నిర్మాత ఇంప్రెస్సివ్ ఐడియా అదే సమయంలో ఆనంద్ దేవరకొండ చిత్రం ఎపిక్ విడుదల తేదీని గుర్తు చేస్తూ.. –మర్చిపోకూడదు కదా.. సెప్టెంబర్ 10త్ ఇస్ యాక్చువల్లీ ద ప్రీమియర్స్ ఆఫ్ ద ఫిల్మ్. సో ఐ హోప్ యు గైస్ లైక్ ఇట్.. ఐ హోప్ యు ఎంజాయ్ ఇట్ అండ్ ఆల్ ద బెస్ట్ గైస్– అంటూ చిత్రయూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశారు. కన్నడ ప్రాంతానికి చెందిన నటి అయినా తెలుగు భాషను, ముఖ్యంగా తెలంగాణ యాసను ఇంత సహజంగా పలకడంపై నెటిజన్లు, అభిమానులు రష్మికపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197